# 3. అద్దె కొంప

కక్కుర్తి పడ్డందుకు - తక్కున రోగం కుదిరింది. ఆ కక్కుర్తిలోకూడా మొగమాటం మిళితమై వుండటంచేత - మొగమాటానికిపోతే ఏదో ఏదో అయిందే - అంతపనీ అయింది! అసలు ఆ కొంపలో జేరేవాళ్ళం కానేకాదు. ఏదో మనం ఎరిగినవాళ్ళనీ, మేజర్లయిన బ్రహ్మచారులకు కొంపలు కరువుగా వున్నాయనీ, ఎట్లాగో ఒకమూల ముక్కు మూసుకొని ముప్ఫైరోజులూ గడుపుతే - ఇదివరకు మార్చి నెలలో గిరికీ కొట్టిన తెనుగు పరీక్షను (ఇది చెప్పుకోవటం గౌరవ హీనం! కాని, మనలో మన కేమిటిలెండి!) తంటాలు పడి నెట్టేస్తే సరిపోతుందని అనుకున్నాం కాని - కథ ఇల్లా అడ్డం తిరుగుతుందని ఎవరనుకున్నారు?

అసలు కథకే వస్తాను. చింత మొద్దుల్లాంటి కాళ్ళు అరిగి కదుములు కట్టేట్లు గుంటూరంతా గాలించాం. కాని - ప్రతివాళ్లూ - విద్యార్థులు తమ బాబుగాళ్ళముల్లె ఎప్పుడో ఎత్తుకుపోయినట్టు - "స్టూడెంట్సుకు మేము రూ మివ్వము" అని నిర్మొగమాటంగా చెప్పడం మొదలుపెట్టారు. తిరగ్గా తిరగ్గా - మా భద్రం మాస్టారు కనపడి తనబంధువు ఇంట్లో రూం ఇప్పిస్తానని తీసుకుపోయి, ఆ చెత్తగది అంటగట్టాడు. చెట్లేమీ లేని చోట తంగేడిచెట్టు మహావృక్షంలాగు - మొదట్లో మాకు అదే బ్రహ్మానందమై - తరువాత కూష్మాండమైంది.

ఇంక ఆ రూమును వర్ణించటం అత్యవసరం! ఆ రూములో రెండు చిన్నరూములు; ఒకటి నలుచదరంగా వుంది. దాని విస్తీర్ణం ఒక చతురపుగజం. మనిషి అడ్డంగానూ పడుకోలేడు, నిలువుగానూ పడుకోలేడు. అల్లా పడుకోవాలంటే రెండు కాళ్ళు తెగగొట్టుకోవాలి! లేకపోతే, అయిమూలగా పడుకోవాలంటే కాళ్ళను పొట్టలోకి

ముడుచుకోవాలి. ఇంక రెండోది ఒక Rectangle గది. అడ్డంలో మనిషి పట్టడు కాని నిలువులో అయితే – ఒక మనిషి. పడుకుంటే, వాడి కాళ్ల దగ్గఱ రెండోవాడు తలమోపి కాళ్లు ముడుచుకుంటేనే కాని సరిపోదు! ఆ గది వెడల్పు 1 1/2 గజం. పొడుగు 8 అడుగులు. వీటి అద్దె ఆ ఒక్క నెలకూ హస్తం (5 రూపాయలు.) గదిలో ప్రవేశించటం ఆలస్యంగా ఇంటాయన ఒక 'Terms Cash' చూపుచూసి – బిళ్లకుడుముల్లాంటి అయిదు రూపాయలు దబాయించి రొడ్డిన దోపుకుని చక్కాపొయ్యాడు.

ఇంక రూములో మా అవస్థ! గదికి వున్న వాకిలి ఎత్తు చాలా తక్కువ – 4 అడుగులు! గదిలో ప్రవేశిస్తూనే వామనులని పేరుపడ్డ మేము – తలవంచుకోవాలి. వంచకపోతే శఠగోపరం పడ్డదన్నమాటే! ఫలానావారి (రోజులు బాగుండలేదు – పేరెందుకులెండి!) రూము తీసుకున్నట్టుగా మాకు శాశ్వతంగా గుర్తు వుండేటట్టు – నా తలకు రెండు బొప్పెలు, మా ఆనందం తలకు సీమరేగిపళ్లలాంటి నాలుగు కుదుళ్ళు ప్రసాదించింది ఆ ముసలి ద్వారబంధం. ఎవరన్నా కొత్తవాళ్ళు మా కోసం వచ్చారా – మా మాట ఎట్లావున్నా వాళ్లుమాత్రం బుర్రమీద కరుడు లేనిదే బయటికి వెళ్లరు. ఆ దెబ్బకు ఎంత బలాఢ్యుడయినా గింగిరాలు తిరిగి సోడా తాగవలసిందే! దీనికిగాను మేము రూము వాకిట్లో "దయ చేసి బుర్రవంచుడు" అని ఒక అట్టమీద రాసి అంటించవలసి వచ్చింది. అందరూ 'No Admission' బోర్డులు పెట్టుకుంటే మేము పైన చెప్పినబోర్డు – కొంత మాకే ప్రమాదం లేకుండా వుండేందు కనుకోండి – కట్టవలసివచ్చింది.

ఇంక రూములో ప్రవేశించగనే – మీకు సుగంధం వేస్తుంది. ఇది యెక్కడిదయ్యా అంటే – ఏనాడో 'ఆటో దిల్‌బహార్' సెంటువారికి పోటీపడి పెద్ద ఎడ్వరుటైజుమెంటు చేసినట్టుగా – మా రూమును ఆనుకొని ప్రవహించే డ్రెయినేజ్ కాలువది! మునుల ఆశ్రమాలకు పక్కగా సెలఏళ్ళు ప్రవహించేవని మన కావ్యాల్లోవుంది. కాని మాకు ఆ నిర్మలోదక పూరిత మయిన యీ మురుక్కాలవ దాపరించినది. దీనికి గాను ఒక ఫినాయిల్ బాటిల్ కొని గంటకొకసారి ఆ కాలువలో చల్లవలసిన అగత్యం యేర్పడ్డది – కాబట్టి ఇప్పుడు మా రూముకు వచ్చేవాళ్లు – అదేదో హాస్పిటల్‌లోని Dispensing, రూమనుకుంటారు.

రూములోకి రాగానే మీకు కళ్లు బైర్లుకమ్మవలసిందే! – దుర్యోధనుడికి మయసభలో ప్రవేశించగానే కళ్ళకు చీకట్లు కమ్మి పైత్యపుతిప్పు వచ్చినట్లుగా! అందుకని రూములోకి యెవరన్నా ప్రవేశించగానే – మే మిద్దరం దబ దబా వెళ్ళి ఆ వచ్చిన వ్యక్తి ఏ గోడమీదన్నాపడి ఒళ్ళు విరుచుకోకుండా – దబాయించి పట్టుకొని చాపమీద కూర్చోపెట్టి ఆయన చేత కొంతసేపు కళ్లు మూయిస్తాము. (ఈ తిప్పలు మాకయినా తప్పవు) కొంతసేపయ్యాక ఆ వచ్చిన వ్యక్తి కళ్లు తెరిస్తే – ఆ గదిలోని వస్తుసంచయం మగత

మగతగా కన్పిస్తుంది అంటే - పిల్లిని చూచి కుక్కనీ, పుస్తకాన్ని చూసి జల్లెడనీ, దూరంగావున్న హరికెన్ లాంతరును చూసి రుబ్బుడుపొత్ర మనీ, ఒక మూలగావున్న చీపురుకట్టను చూసి పచ్చడిబండనీ భ్రమించాల్సిందే! ఇట్లా యెందుకనీ అంటే - గదికి ఒకే ఒక్క కిటికీ వుంది. ఈ గది చూశాక - చిన్నతనంలో దేశచరిత్రలో చదువుకున్న 'కలకత్తా చీకటిగది' బాగా బోధపడ్డది. ఆ కిటికీలోనుంచి సూర్యరశ్మి కొద్దిగా వచ్చి - రూము ఏ ఉత్తర ధ్రువంలోదిలాగో వుంటుంది. ఈ అవస్థ తప్పించుకునేందుకు మొదట్లో బ్యాటరీ లైటు సహాయం పుచ్చుకున్నాం కాని - ఎలక్ట్రిక్ కరెంటు ఖరీదు జాస్తిగా వుండబట్టి - త్వరగా కొంప లారుతాయని - పగలుకూడా హరికేన్ లాంతరు వెలిగించేవాళ్ళం. రూములో కూర్చుంటే మాత్రం - ఏ హిమాలయా పర్వతప్రాంతమో ఏ నీలగిరి కొండలో జ్ఞాపకానికి రావల్సిందే!

రూములోకి రావాలంటే ఒక చిన్నబ్రిడ్జి దాటాలి. అది రూముకు ప్రక్కగా ప్రవహించే మురుగు నదికి (ఈ నది జీవనదుల లిస్టులోదే!) ప్రత్యేకంగా నిర్మింపబడ్డ ఓటిబ్రిడ్జి. అంటే - సరిగా సగానికి స్పష్టంగా పగిలిన ఒక పాత నాపరాయి పరువబడివుంది. దానికింద పోటీకి పెద్ద కొండరాళ్ళు రెండు వున్నాయి. ఆ బ్రిడ్జి ఏ ఇంజనీరు మహాశయుడు కట్టాడో (జనన మరణ రిజిష్టర్లు వెతకాలి) కాని - దానిమీద నడుస్తూ వుంటే పక్కన యెవరన్నావుండి 'దేవా బహుపరాక్' అనవలసినంత అగత్యం వుంది. కొండరాళ్ళ ఎగుడు దిగుళ్ళవల్ల మీటర్ గేజి గూడ్స్ బండిలాగు - ఆ బ్రిడ్జి అటూ ఇటూ వూగుతుంది. మనిషి తొణికాడా - దభీమని మురుక్కాలవలో పడి జలకాలాడవలసిందే! మేము ఇంజనీర్లము కాక పోయినా - మా శాయశక్తులా ప్రయత్నించాము కాని ఆ బ్రిడ్జిమాత్రం బాగుపడలేదు.

ఒకనాడు, ఖర్మంజాలక 180 పౌనులు బరువుగల ఒక సన్నని, తేలిక మనిషి మా రూముకు వచ్చి ఇందాకటి బ్రిడ్జిమీద దబాయించి కాలు వేసేప్పటికి - ఇందాక చెప్పిన పగులు దగ్గర - బాగా ప్రాక్టీసున్న నంబిమహాశయుడి చేతిలో పగిలిన కొబ్బరికాయలాగు - ఆ నాపరాయి రెండు ముక్కలయింది. ఆయన మోకాళ్ళ వరకూ మురుక్కాలవలో కూరుకుపొయ్యాడు; ఎలాగైతేనేం ఇరుగువాళ్ళనూ, పొరుగువాళ్ళనూ నలుగుర్ని పిలిచి - ఆ మనిషిని బయటికి లాగేప్పటికి 'గండం గడిచి పిండం బయట పడ్డట్టు' మా తలప్రాణాలు తోకకు వచ్చాయి. ఇంక ఆ మహాశయుడు - - నూతి దగ్గరకు వెళ్ళి ఇటుకరాళ్ళు, గడ్డి గాదలు వేసి - - ఆ ఉప్పు నీటితో (అంటే మాకు రోజూ సముద్ర స్నానం అని వేటే చెప్పాలా?) పాద ప్రక్షాళనచేసుకొని - రూములోకి వస్తూవుండగా - మా గుడి అర్చకుడయిన "శ్రీ ఓటిద్వారం" గారు పిడుగులాటి ముష్టిఘాతాన్ని ప్రసాదించారు. మాకు పట్టరాని నవ్వు వచ్చింది. కాని - నవ్వితే ఆయన ఏమన్నా అనుకుంటాడని - జేబు రుమాళ్ళను టెన్నిస్ బంతుల్లాగు చేసి - వక్త్ర గహ్వరాల్లో కుక్కుకున్నాం. ఆ పెద్దమనిషికి దెబ్బకు గిద్దెడు మిరియాలు రాలాయి.

కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చి బావురుమని ఏడ్చేందుకు సిద్ధమయ్యాడు. ఆ తాంబుర లాంటి తలపెట్టి మా ముసలి ద్వారబంధాన్ని ఢీకొనటంతో (గొర్రెపొట్టేళ్ళ పందెం నేను చూశాను కాని ఇంత బలమైన బుర్రగల పొట్టేలు వున్నట్టు మాత్రం నేను ఎక్కడా వినను కూడా వినలేదు!) సింహద్వారం సగానికి పగులిచ్చింది. ఆయన అయిదు నిమిషాలకు తెప్పరిల్లాడు - మేమిచ్చిన సోడా బాటిల్‌తో. ఆ తరువాత రూములోకి ప్రవేశించేందుకు ఆయన పడ్డ అవస్థ ఇంతా అంతా కాదు! పందిపిల్లలాంటి పందికొక్కు చిట్టెలుకల బోనులోకి ప్రవేశించగలదా? ఆనాడు మా అదృష్టం బాగావుంది కాని, లేకుంటే ఆ స్థూలకాయుడు ద్వారబంధంలో ఇరుక్కొని - అటూరాక, ఇటూ పోకపోయినట్టయితే - ద్వారబంధం భేదించవలసి వచ్చేది, లేకపోతే ఇనుప గొలుసులూ, క్రేనులు తెచ్చి ఆయన్ని బయటికి లాగవలసి వచ్చేది. కాని మా ఆనందం చెప్పిన ఉపాయంతో ఆయన ఒక పక్కకు తిరిగి, తల బాగావంచి, తన గంగాళం లాటి పొట్టను ముందు దాటవేసి, తరువాత తన బొందిని రూములోకి చేరవేశాడు. ఆయనకూ మా ఆనందానికీ పడదు. ఆయనను ప్రత్యేకం ఏడిపించేందుకు - మా ఆనందం ఆయన్ను మా రూముకు ఆహ్వానించాడు. విరోధులమీద, కిట్టనివాళ్ళ మీద పగ తీర్చుకునేందుకు - లోకంలో మా రూముకన్న మంచి ఉపాయం, వుండదనే నా నమ్మకం!

ఇంక రూముకువున్న గోడలు చూసేందుకు మహా భయంకరంగా వుంటాయి; గోడలకు ముప్పాతిక విస్తీర్ణానికి సున్నపు పెల్లలు రాలిపోయి - గోడలనిండా జన సంఖ్య సూచించే పటాలు, వర్షపాతం చూపే పటాలు - ఏర్పడ్డాయి. ఇన్ని పటాలున్న Atlas ను మాత్రం మీరు ఎక్కడా చూచి వుండరు! ఆ పుచ్చుపట్టిన దూలాలు నల్లగా జీడిగింజల్లాగు వుంటాయి. అందులో మధ్యదూలం విరిగి, కిందకి వంగి కూడావుంది; అది ఇప్పుడో ఇంకాసేపటికో విరిగి మీద పడుతుందేమో నన్నట్టుగా వుంది. అందుకని ఆ దూలం కింద పడుకోవటం మానేశాము - ప్రాణభయం చేత! పోతే, మిగిలిన జానెడు కొంపలోనూ మూరెడు కర్రలాగు వుంది మా అవస్థ. దూలాలకున్న బూజుతుట్టెల సంఖ్య - పాడుపడ్డ గంగానమ్మ గుడి దగ్గరవున్న 150 సం॥లు వయస్సు గలిగిన ముసలి మఱ్ఱి చెట్టుకు వేలాడే గబ్బిలాల సంఖ్యకు - ఏమాత్రము తీసిపోదు. ఆ తుట్టెలు వుండేవి అట్లావుండక మెల్లిగా అటూ, ఇటూ ఉయ్యాల వూగుతూ వుంటాయి. చీకట్లో, అవి జీవరాసులేమోనని భయపడుతే మాత్రం తాయత్తో, రక్ష రేకో కట్టించుకోవలసివస్తుంది!

అప్పుడప్పుడు మా చదువును పరీక్షించేందుకు కొన్ని గబ్బిల రాజాలు - మా రూములోనికి వచ్చి - దొంగతనంగా రోడ్డుమీది చింతచెట్టు ఎక్కి, చింతకాయల్ని రాల్చే హైస్కూలి కుర్రవాడిలాగు - ఆ బూజుతుట్టెల్ని రాలుస్తూ వుంటాయి. “హుష్! - హూష్!” అని మేము వాటిని తరిమినకొద్దీ అవి “హుం మామీదనా మీ ధిక్కారము!

అన్నట్టు - మతీ చెలరేగి వరస పెట్టి బూజుతుట్టెల్ని అన్నింటినీ బీరు పోకుండా దులిపి - రూమును చీకాకు పరిచి మతీ వెళ్తాయి. ఏనుగు మీద పూచికపుల్లలు ప్రయోగించినట్టు మా ఆనందం వాటిమీద - ఒకటి రెండుసార్లు తన బైండు పుస్తకాల్ని బ్రహ్మాస్త్రం లాగు బలంకొద్దీ విసిరాడు కాని - ఆ దెబ్బ వాటికి తగలకపోను - ఒక బూజు తుట్టెను రాల్చి - పుస్తకం చిరగటం కూడా అయింది. అప్పటినుంచీ గబ్బిల రాజాలు మా రూములోనికి వస్తే - దేవుడో అంటూ - నూతన దంపతుల్ని సారె గదిలో వదిలివెళ్ళే మూసివాయినపు ముత్తయిదుల్లాగు - మేము నెత్తిన గుడ్డవేసుకొని - ఆ గబ్బిలాలు తమ వినోదక్రీడలనుంచి విరమించేదాకా - గది బయట నిలువుజీతం మీద 'ఫారాహుషార్' ఇస్తూ వుండేవాళ్ళం. ఈ గబ్బిలాలు అప్పుడప్పుడు ఉభయకుశలోపరి కనుక్కునేందుకు వచ్చేవి. కాబట్టి అంత పట్టింపు లేదనుకోండి!

ఇంక, గోడలనుంచి పెద్ద పెద్ద పెల్లలు విసుగూ విరామం లేకుండా రాలుతూ వుంటాయి. కొత్తవాళ్లు భూకంపమని భ్రమసిపోతారు కూడాను! కన్నెత్తి దూలాల వైపుచూస్తే ఇంతమన్నూ మశానమూ కళ్లలోకి రాలుతుంది. కొంచెం పెద్ద పెల్లయితే కలియుగ శుక్రాచారిగానో, అభినవ ధృతరాష్ట్ర సార్వభౌముడి గానో మారిపోవలసిందే! కొంచెం చిన్న పెల్లయితే వారం రోజులు సిల్వర్ నైట్రేట్ సొల్యూషన్‌ను, కలికాన్నీ వుపయోగించి దృష్టి బడయవచ్చు. ఈ అవస్థ తప్పుకునేందుకు మేమిద్దరమూ చెరివొక జపాన్ కళ్లజోడునూ (కానీకి ఒకటి బాపతు) కొని, రూములోకి వెళ్లబొయ్యేముందు (అది పెట్టుకు రోడ్డుమీద తిరుగుతే, పగటివేషగాళ్లని కుఱ్రకుంకలు తగులుకోగలరు!) ఆ సులోచనాలను ధరించేవాళ్లం విమానంలోకి ఎక్కబొయ్యే Pilot లాగు!

గోడలకూ, తలుపు చెక్కలకూ చెదలు వున్నాయి. శతకోటి లింగాల్లో బోడిలింగంలాగు, ఇవికూడా మాకు దాపరించినందుకు చెప్పుకోవాలి! ఈ ఉదయం చీపురు పెట్టి చెదలు బాగుచేస్తే - తెల్లారేప్పటికి మళ్లీ తయారు - పబ్లిక్ హైరోడ్డు మీద తయారయ్యే చెత్తలాగు! వీటిని తప్పించుకునే మార్గం కనబడక ఇద్దరం కిక్కురు మనకుండా - చెప్పు కింది తేల్లాగు గప్ చిప్‌గా వూరుకున్నాం. పీచుమిఠాయిలాగు; ఆ రూములో మూడు నాలుగు సాలెగూళ్లుకూడా వున్నాయి.

అన్నిహంగులూ వున్నప్పుడు, మేము తక్కువ తిన్నామా అన్నట్టు ఎఱ్రచీమలకు కూడా ఆ రూము జగత్ ప్రసిద్ధమే! చీమలు మహాచిన్నవయినా ఒళ్లంతా సవరిస్తూ వుండేవి. చెవిమీదకుట్టిన చీమను నలపటం ఆలస్యం కాలి వేలిమీద - దాని మేనల్లుడు అంటపొడిచి వూరుకుంటాడు. మేము కదలకా మెదలకా ఒకరోజు అక్కడ తిష్ట వేసి కూర్చుంటే - చ్యవనుడి శరీరానికి ఎక్కుపెట్టి ఎఱ్ర చీమలు కట్టిన మట్టిసౌధాలు - మాకు కూడా తయారవుతాయి. గతుకులు గతుకులుగా వున్న ఆ నేలలోని లోయల్లో నుంచి యెడతెరపి లేకుండా ఒక దానివెంట ఒకటి వచ్చే చీమల్ని వెంటాడటం మాత్రం మాకు తప్పలేదు.

సూర్యుడు అస్తమించటం ఆలస్యం - పక్కనే వున్న జీవనది గర్భగోళంలోనుంచి - మాయాబజార్లో ఘటోత్కచుడు సృష్టించినట్టు - దోమలదండు మా రాజ్యంమీదికి - కాదు - మా ఘటాలమీదికే దండెత్తేవి. పరిమాణంలో ఒక్కొక్కటి అత్రగడ్డ బియ్యపు గింజంతవున్నా - వాటికి వున్న ఉక్రోషం, పౌరుషం మహా ఎక్కువ. నేను కొల్లేటి దోమధాటీ పోటుకూడా తినివున్నాను కాని - ఈ దోమల పోటుకు మాత్రం నా అల్ప ప్రాణం ఆవటిల్లేది. అది వచ్చి శరీరంమీద వాలంగానే చీదరపుట్టి ఒళ్లు జలదరించేది. అది వెంటనే చచ్చేలాగు చెయ్యి బలంకొద్దీ విసిరి అది వాలిన స్థలానికి సూటిగా - ఠపీమని కొడితే - ఆ దోమ యుగంధర యుక్తితో దెబ్బ తప్పుకునేది. ఆ చేతి తీవ్రత శరీరం మీదపడి అయిదువేళ్ళూ అచ్చుపడేలాగు వాతపడేది. ఇప్పుడు ఆ దోమ "నాప్రాణానికే ఎసరు పెడ్తావుట్రా డింభకా!" అన్నట్టుగా - ఆర్కెస్ట్రాతో సహా 'బొంయ్' మని రొద చేస్తూ బయలుదేరి వచ్చేది - పెళ్ళి వారిలాగ! మన ప్రబంధాల్లో విరహావస్థపడే రంగంలో కవులు తుమ్మెద ఝుంకారాన్ని వర్ణించారు - కాని, ఏ అవస్థాలేని యీ బ్రహ్మచార్లకు దోమల ఝుంకారం ప్రాప్తించింది. ఆ దోమలు మాకు ఆజన్మాంతమూ జ్ఞాపకం వుండేందుకుగాను మా శరీరాలమీద వేసిన వాతలూ, పడ్డ ట్రేడ్ మార్కులు పెద్ద పెద్ద పుట్టుమచ్చల్లాగు ఇప్పటిక్కూడా నిల్చి వున్నాయంటే - ఆశ్చర్య మెందుకు? అవ్విమాత్రం మా యువక రక్తాన్ని గ్యాలనులు గ్యాలనులు పీల్చి తెగబలిసి - జనాభా ఎక్కువయ్యాయి. పోతే, ఈ దోమల్ని తప్పుకునేందుకు ఎప్పుడూ ఫ్యాన్ (అంటే ఎలక్ట్రిక్ ఫ్యాన్ కాదు కాని - మేదరఫ్యాన్ లేక తాటిఫ్యాన్) తిరుగుతూ వుండాల్సిందే - చేతులు పడిపొయ్యేటట్టుగా!

తలుపులకు వున్న తుప్పు పట్టిన ఇనుప గడియను - గట్టిగా పట్టుకుంటే విరిగేటంత శిథిలావస్థలో వుండటంచేత - తలుపువేసి దానికి సగంపగిలిన రాతిరోలు వొకటి పోటీ పెట్టేవాళ్ళం.

ఇన్ని లక్షణాలు వున్న యీ రూముకు, చెప్పదగ్గ మరో చిత్రం కూడా వుంది. మాపక్క భాగంలో ఒకానొక ఫిలింస్టారు (ఏమిస్టారులెండి! రెండుమూడు తెలుగుఫిల్ముల్లో దాసీపాత్ర వేసిందట!) వుంది. ఆ బంగారమ్మ శృంగారించుకొని - ఈ కేతిగాళ్లకోసం మా రూములోకి వెలుగువచ్చే కిటికీదగ్గరకు వచ్చి దాగుడుమూతలు ఆడుతూ - తన కొంగ మెడలాంటి మెడను చాచి కిటికీలోనుంచి మామీదికి సైట్లు విసరుతూ వుండేది! మాకు అక్కర్లేదు పోవే అంటే ఉహూం కదలదే! చిరునవ్వు ఒలకబోసుకుంటూ తన దాసీనటన అంతా మా ముందు వెలగబెట్ట బోతుంది. మేకప్‌లో ముఖానికి వార్నీష్ రాచుకొని తళతళా మెరుస్తే మెరవవచ్చు కాని - ఈ యమలో వుండే మిణుకు మిణుకు చక్కదనం ఒక లెక్కలోది కాదు. కళ్ళను అదో మాదిరిగా తిప్పుతూ విరహతాపాన్ని ప్రకటిస్తూ అర్థనిమీలిత నేత్రాలతో మామీద దృష్టిబాణాల్ని ప్రయోగించేది అనేక పోజుల్లోను, ఏంగిల్స్‌లోనూ వుండి. మే మే మన్నా చదువుకు మన్నుకొట్టుకు

పోయేందుకు వచ్చామనుకుందో లేక మేము కెమేరామ్యాన్‌లమూ, దొరల్లాగే ఉన్నతోద్యోగులమూ అనుకుందో -? మొదట్లో ఈమెకు పిచ్చేమో అనుకున్నాము కాని, తరువాత ఆమెవంక కళ్లు మూసుకొని చూడటం ఆరంభించాము. కాని ఆమెమాత్రం కాట్టీడి కోక కట్టి జాకెట్టు లేకుండా - బాడీతో వచ్చి - కాపీ చేసే కుర్రాణ్ణి చూచే వాచర్‌లాగు - మమ్ము చూచేది! ఆవిడ, తన అందానికి మేము చిత్తయ్యా మనుకొని వుంటుంది! ఏదెల్లావున్నా మాకు మాత్రం ఆమెవల్ల పెద్దప్రమాదం సంభవించలేదు కాని - ఆమె మా Attention లాగేందుకు పాడేపాటలు గుడ్లగూబ కంఠాన్ని సూచించేవి. ఆమె వంటయింట్లో సత్తు గిన్నెలు, రాచిప్పలు చప్పుడు చేస్తూంటే - మాకు, తెలుగు టాకీల్లోని భూకంపం, తుఫాను సీనులు - స్టంటు పిక్చర్స్ లోని ఘోరపోరాటాలు, జంపింగులు తలపుకువచ్చేవి.

ఇంక ఈ రూము ఫలితాలు కూడా చెప్పి విరమిస్తా! ఈ అద్దెకొంపవల్ల మేము పరీక్షలో యండెన్ పల్టీ కొట్టామని మీరు అప్పుడే ఊహించుకొనే వుంటారు. పోతే లేనిపోనిది మలేరియా జ్వరాన్ని కూడా కొనితెచ్చుకున్నామని వేఱే చెప్పక్కర్లేదు! ఓడిన వస్తాదులాగు నెత్తిన ముసుగు పడనే పడింది కదా! ఇంక, మేమారూములో వున్నట్టు జ్ఞాపకార్థంగా మా శరీరాలమీద యేర్పడ్డవాతలు, ట్రేడ్‌మార్కులూ, బొబ్బలేకాకుండా - మా బుర్రల మీద కట్టిన కదుములు - ఇప్పటికీ - ఇండియా మ్యాపులోని పీఠభూముల్లాగ వున్నాయన్న సంగతి మీకు తెలిసిందే! ఇంతకూ ఈ అద్దెకొంప మహత్యం అంతా “డబ్బుపోయి శనిపట్టె - థాం! థాం! థాం!”

- జులై, *1940*